
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం। 6। మార్చి। 2024



నేటి నుంచి పగిడిద్దరాజు జాతర

మేడారం సమ్మక్క భర్తపగిడిద్దరాజు జాతర గుండాల మండలం యాపలగడ్డలో బుధవారం ప్రారంభం కానుంది. 8లో



చేరువవుతారా.. చేజారుస్తారా..

సింగరేణి నిర్దేశించిన 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి మరో 25 రోజుల్లో 7.28 మిలియన్ టన్నులు సాధించాల్సి ఉంది. 8లో

గరిష్టం / కనిష్టం
36° / 22°

వాతావరణం

జిల్లాలో బుధవారం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం ప్రారంభమైన ఎండ గంటగంటకూ పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

హౌస్ ఆఫీసర్‌గా ట్రెయినీ ఐపీఎస్



విక్రాంత్ కుమార్ సింగ్

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ట్రైనీ ఐపీఎస్ అధికారి విక్రాంత్ కుమార్ సింగ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఢిల్లీకి చెందిన విక్రాంత్‌కుమార్ 2022 బ్యాచ్ అధికారి. ఆయన తండ్రి రిటైర్డ్ న్యాయమూర్తి కాగా, సోదరుడు ప్రస్తుతం వారణాసిలో న్యాయమూర్తిగా విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో విక్రాంత్‌కుమార్ సింగ్ ఇండియన్ ఆడిట్ అకౌంట్స్ సర్వీస్, ఇండియన్ సివిల్ అకౌంట్స్ సర్వీస్‌కు కూడా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్పీ రోహిత్‌రాజ్ ఆదేశాల మేరకు శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, గంజాయి రవాణా, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తానని చెప్పారు.

పల్స్ పోలియో నిర్వహణపై తనిఖీ



చిన్నారి చేతిపై మార్కింగ్‌ను పరిశీలిస్తున్న బాలాజీనాయక్

బూర్గంపాడు: ఇటీవల నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమ తీరుపై జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి బాలాజీనాయక్ తనిఖీ నిర్వహించారు. మండలంలోని మోరంపల్లిబంజరలో ఇంటింటికీ వెళ్లి పల్స్ పోలియో చుక్కల నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. పోలియో చుక్కలు వేసిన పిల్లల ఎడమచేతిపై మార్కింగ్‌ను పరిశీలించారు. ఇప్పటికీ చుక్కల మందు వేయించని వారుంటే తప్పక వేయించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగభూషణం, పీహెచ్‌సీ వైద్యాధికారి లక్ష్మీసాహితి, సత్యవతి, సోమ్లానాయక్, రవి పాల్గొన్నారు.

శ్రీలతకు జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న శ్రీలత

మణుగూరు రూరల్: మణుగూరుకు చెందిన కొత్త శ్రీలత బహుజన సాహిత్య అకాడమీ బెస్ట్ బ్యూటీషియన్ జాతీయ అవార్డును మంగళవారం అందుకున్నారు. ఈ సందర్భంగా బీఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా సమాజ శ్రేయస్సు, కార్మిక, సాహిత్యం, కళలు, క్రీడా రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారిని ప్రోత్సహించేందుకు జాతీయ పురస్కారాలను అందిస్తున్నామని చెప్పారు. ఈ క్రమంలో శ్రీలత బెస్ట్ బ్యూటీషియన్ అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు.

సమరానికి సన్నాహం



లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ త్వరలోనే వెలువడుతుందన్న సంకేతాలతో బీఆర్‌ఎస్ సమరానికి సిద్ధమవుతోంది. ఇప్పటికే ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థిగా నామ నాగేశ్వరరావును బరిలో దింపుతున్నట్లు పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. దీంతో అన్ని నియోజకవర్గాల ముఖ్యనేతలతో సమన్వయ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఖమ్మంలో గురువారం జరిగే లోక్‌సభ పరిధి ముఖ్యనేతల సమావేశానికి మాజీ మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్‌తోపాటు ఎంపీలు నామ, వద్దిరాజు తదితరులు హాజరు కానున్నారు. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటేలా బీఆర్‌ఎస్ వ్యూహాలు

- సిట్టింగ్ సీటు దక్కించుకునేలా ప్రణాళిక
- రేపు లోక్‌సభ పరిధి ముఖ్యనేతలతో సమన్వయ సమావేశం
- హాజరుకానున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ

అసెంబ్లీ ఎన్నికల్లో పరాభవం..

గత ఏడాది జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్‌కు పరాభవం ఎదురైంది. 2014, 2019 ఎన్నికల్లో ఒక్క సీటే దక్కించుకున్నా.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నేపథ్యాన ఇక్కడి ఓటమిని ఆ పార్టీ అధినేత కేసీఆర్ పట్టించుకోలేదు. కానీ ఈసారి కూడా గతంలో మాదిరిగానే ఒక సీటే రావడంతో నేతలు నిరాశ చెందారు. కేవలం భద్రాచలం నుంచి తెల్లం వెంకట్రావు మాత్రమే గెలుపొందగా.. పలువురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఓడిపోవడంతో శ్రేణుల్లో నిస్తేజం అలుముకుంది. అయితే పార్లమెంట్ ఎన్నికలకు వారిని కార్యోన్ముఖులను చేసేలా పార్టీ అధినేత కేసీఆర్‌తోపాటు మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఉమ్మడి జిల్లాల నేతలతో సమావేశమవుతున్నారు.

గత ఎంపీ ఎన్నికల్లో విజయం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 2018 శాసనసభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అపజయం పాలైనా.. ఆ తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం సత్తా చాటింది. ఆ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా నామ నాగేశ్వరరావు, కాంగ్రెస్ అభ్యర్థిగా రేణుకాచౌదరి పోటీ చేశారు. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించిన ఓటర్లు.. పార్లమెంట్‌కు వచ్చే సరికి బీఆర్‌ఎస్‌కు మద్దతు పలికారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావుకు 5,67,459 ఓట్లు రాగా.. కాంగ్రెస్ అభ్యర్థి రేణుకాచౌదరికి 3,99,397 ఓట్లు వచ్చాయి. తద్వారా 1,68,062 ఓట్ల తేడాతో నామ విజయం సాధించారు.

రేపు సన్నాహక సమావేశం..

లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా నేతలు, శ్రేణులను సమన్వయం చేసేందుకు గురువారం బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే బీఆర్‌ఎస్ ముఖ్యనేతలతో సమావేశమైన మాజీ సీఎం కేసీఆర్ చేసిన సూచనలపై విస్తృతంగా చర్చించడమే కాక ఉమ్మడి జిల్లాలోని నేతలకు పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాల్సిన ఆవశ్యకతను వివరించనున్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన ప్రణాళిక, ఎక్కడ బలంగా ఉన్నాం.. ఎక్కడ బలహీనంగా ఉన్నామనే అంశాలను చర్చించే అవకాశముంది. కాగా, ఈ సమావేశానికి మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్‌తోపాటు ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ, జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు హాజరవుతారు. అలాగే, పార్టీ ప్రజాప్రతినిధులు కూడా హాజరు కావాలని సూచించారు.

సిట్టింగ్ స్థానంపై గురి

సిట్టింగ్ స్థానమైన ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గాన్ని మళ్లీ దక్కించుకునే లక్ష్యంతో బీఆర్‌ఎస్ అడుగులు వేస్తోంది. ఇందుకోసం ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకముందే గులాబీ బాస్ సమీక్షలు ప్రారంభించారు. ఇప్పటికే ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల నేతలతో కేసీఆర్ సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికలపై దృష్టి సారించాలని, ఈ ఎన్నికల్లో గెలవడం ద్వారా బీఆర్‌ఎస్ సత్తా చాటాలని సూచించారు. ముందు నుంచే ఎన్నికలకు సన్నద్ధమయ్యేందుకు వీలుగా ఖమ్మం అభ్యర్థిగా సిట్టింగ్ అయిన నామ పేరునే ఖరారు చేశారు.

ఏర్పాట్లు వేగవంతం చేయండి

11న సీఎం పర్యటనపై కలెక్టర్ సమీక్ష

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో ఈనెల 11న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ ప్రియాంక ఆల ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్‌తో కలిసి మంగళవారం ఐడీఓసీలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రామాలయ దర్శనం అనంతరం అభివృద్ధి పనులపై గిరిజన భవన్‌లో సీఎం నిర్వహించే సమావేశానికి, లక్ష్మీపురంలో ఎంపిక చేసిన సభా స్థలంలో ఏర్పాట్లను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో జరిగే అన్ని అభివృద్ధి పనుల పురోగతిపై ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ధరణి, ఎల్‌ఆర్‌ఎస్, ప్రజాపాలనకు వచ్చిన దరఖాస్తులు, ఎంతమంది అర్హులనే వివరాలపై నివేదికలు తయారుచేయాలని సూచించారు. విద్య, వైద్యశాఖలకు ఇప్పటివరకు మంజూరైన నిధులు, చేపట్టిన పనులు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అభివృద్ధి పనులపై నివేదికలు సిద్ధం చేయాలన్నారు. భద్రాచలం వద్ద నిర్మిస్తున్న రెండో వంతెన పనులు శ్రీరామనవమి నాటికి పూర్తి చేయాలని నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని మిషన్ భగీరథ అధికారులకు సూచించారు. భద్రాచలం రామాలయ పరిధిలోని భూముల వివరాలు, ఆలయ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు సిద్ధంగా ఉండాలని ఈఓ రమాదేవికి సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు ఇచ్చిన పోడు పట్టాల వివరాలు సమర్పించాలని డీఎఫ్‌ఓ కృష్ణగౌడ్‌ను ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీఓ విద్యాచందన, డీఆర్‌ఓ రవీంద్రనాథ్, ఏఓ గన్యా, డీఎంహెచ్‌ఓ శిరీష, డీఎస్‌ఓ రుక్మిణీదేవి, భద్రాచలం, కొత్తగూడెం ఆర్డీఓలు కె.దామోదర్‌రావు, మధు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ బడ్జెట్ ప్రణాళికలు రూపొందించాలి

మున్సిపాలిటీ ఆదాయ, వ్యయాల నిర్వహణపై బడ్జెట్ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ప్రియాంక ఆల కమిషనర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మున్సిపాలిటీల ఆదాయ, వ్యయాలను బేరీజు వేసుకుని పొరపాట్లకు తావులేకుండా బడ్జెట్ తయారు చేసి కౌన్సిల్ ఆమోదం తీసుకోవాలని చెప్పారు. గతేడాది డ్రెయిన్లు, రహదారుల నిర్మాణానికి కేటాయించిన నిధులు, ఖర్చుల వివరాలు అందజేయాలని సూచించారు. ఇళ్ల నుంచి వ్యర్థాల సేకరణ ప్రక్రియ కొత్తగూడెంలో 72, పాల్వంచలో 81, ఇల్లెందులో 96, మణుగూరులో 62 శాతం జరుగుతోందని, తక్కువ సేకరణ జరుగుతున్న వార్డుల్లో ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఆర్పీలను భాగస్వామ్యం చేయాలన్నారు. వార్డుల వారీగా సేకరించిన తడి చెత్తను అక్కడే వర్మి తయారు చేసేలా యూనిట్లు ఏర్పాటు చేయాలని, ఇందుకోసం ప్రత్యేకాధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. పట్టణాల్లో ఫుట్‌పాత్‌లపై పాదచారులు నడిచే పరిస్థితి లేదని, ఆక్రమణలు తొలగించాలని స్పష్టం చేశారు. మరణించిన వారి దహన సంస్కారాలకు గ్యాస్ ఆధారిత దహన వాటికలు ఏర్పాటు చేయాలని చెప్పారు. రహదారుల పరిశుభ్రతకు స్వీపింగ్ యంత్రాలను వినియోగించాలని చెప్పారు.

మహిళలు రోల్‌మోడల్‌గా నిలవాలి



కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల, పక్కన విద్యాచందన, విజేత తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం) : మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ సమాజానికి రోల్‌మోడల్‌గా నిలవాలని కలెక్టర్ ప్రియాంక ఆల పిలుపునిచ్చారు. మంగళవారం ఐడీఓసీలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళాభివృద్ధికి విద్య ప్రధానమని అన్నారు. మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీఆర్డీఓ విద్యాచందన మాట్లాడుతూ.. మహిళల పట్ల వివక్ష నిర్మూలన కుటుంబం నుంచే ప్రారంభం కావాలన్నారు. మహిళా శిశు సంక్షేమ అధికారి విజేత మాట్లాడుతూ.. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలంటే విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ జండర్ ఈక్విటీ అధికారి అన్నామణి, సీడీపీఓలు కనకదుర్గ, జ్యోతి, లక్ష్మీ ప్రసన్న, సులోమి, రూప పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో..

ప్రజాపాలన సేవా కేంద్రాల సాఫ్ట్‌వేర్‌పై మంగళవారం విద్యుత్ శాఖ కార్యదర్శి హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. కలెక్టర్ ప్రియాంక ఆల పాల్గొన్నారు. ప్రభుత్వ గ్యారంటీ పథకాలపై జిల్లాలో చేపడుతున్న చర్యలను వివరించారు.

వినియోగదారుల సంక్షేమమే లక్ష్యం

సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ తిరుమల్‌రావు

టేకులపల్లి: వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీజీఆర్‌ఎఫ్ (వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార ఫోరమ్) పని చేస్తుందని ఫోరమ్ చైర్మన్ కె.తిరుమల్‌రావు అన్నారు. విద్యుత్ శాఖ లక్ష్మీదేవిపల్లి సబ్ డివిజన్ పరిధిలోని లక్ష్మీదేవిపల్లి, బొమ్మనపల్లి, టేకులపల్లి సెక్షన్ల వినియోగదారుల సదస్సు మంగళవారం టేకులపల్లిలో నిర్వహించారు. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, కొత్తమీటర్లు, బిల్లింగ్‌లో తప్పులు, అధిక బిల్లులు, పేర్లలో తప్పులు, ఓవర్ లోడింగ్, లో ఓల్టేజీ, గృహజ్యోతి పథకం తదితర అంశాలపై వినియోగదారులు దరఖాస్తులు అందించారు. ఈ సందర్భంగా తిరుమల్‌రావు మాట్లాడుతూ.. తెల్ల రేషన్ కార్డు ఉండి, గృహజ్యోతికి దరఖాస్తు చేసుకోని వారు, చేసుకున్నా సబ్సిడీ రాని వారు తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, విద్యుత్ బిల్లు తీసుకుని ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. 9440811299, 8333923840 నంబర్లకు వాట్సాప్ ద్వారా విద్యుత్ సమస్యలు తెలియజేసి ఇంటి నుంచే పరిష్కారం చేసుకునే అవకాశం ఉందని వివరించారు. కార్యక్రమంలో సీజీఆర్‌ఎఫ్ సభ్యులు ఆర్.చరణ్‌దాస్, ఎన్.నరేందర్, ఎస్‌ఈ రమేష్, డీఈ నందయ్య, ఏఈలు హట్కర్ దేవా, పి.బుజ్జి కన్నయ్య, రఘురామయ్య, జేఏఓ లావణ్య తదితరులు పాల్గొన్నారు.



వినియోగదారుల సదస్సులో మాట్లాడుతున్న తిరుమల్‌రావు

బహిరంగ సభాస్థలి పరిశీలన



సభాస్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

బూర్గంపాడు: ఈనెల 11న సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా లక్ష్మీపురంలో నిర్వహించనున్న బహిరంగ సభాస్థలిని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం పరిశీలించారు. లక్ష్మీపురంలోని రెండు ప్రాంతాల్లో స్థలాలను గుర్తించగా పోలీస్‌శాఖ అధికారులతో కలసి సందర్శించారు. ఈ బహిరంగ సభలోనే సీఎం రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించే అవకాశం ఉందని సమాచారం. కార్యక్రమంలో సీఐ వినయ్‌కుమార్, ఎస్సై నాగభిక్షం, కాంగ్రెస్ నాయకులు పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బాదం రమేష్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి అభివృద్ధి కోసమే సీఎంను కలిశా..

పార్టీ మార్పు ప్రచారాన్ని ఖండించిన ఎమ్మెల్యే

భద్రాచలంటౌన్: భద్రాచలం నియోజకవర్గ సమస్యల పరిష్కారం, అభివృద్ధి కోసమే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశానని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ అన్నారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో మంగళవారం జరిగిన బీఆర్‌ఎస్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను పార్టీ మారుతున్నట్లు వచ్చిన వార్తలను ఖండించారు. గత ఎమ్మెల్యే నాటి సీఎం కేసీఆర్, మంత్రులతో సరైన సంబంధాలు కొనసాగించనందునే భద్రాద్రి అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. ఇప్పుడా పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతోనే సీఎం, మంత్రులను కలిసి భద్రాద్రి అభివృద్ధికి సహకరించాలని వినతిపత్రం అందించానని తెలిపారు. ఈనెల 11న భద్రాచలం వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి నియోజకవర్గ సమస్యలపై వినతిపత్రం అందజేస్తానని వివరించారు. సమావేశంలో నాయకులు అరికెళ్ల తిరుపతిరావు, కృష్ణమూర్తి, సత్యనారాయణమూర్తి, రమాకాంత్, చిట్టిబాబు, రాము, విజయ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్

ఓసీ విస్తరణకు కసరత్తు..



మణుగూరు ఓసీ వ్యూ పాయింట్



ఓసీ విస్తరణ ప్రతిపాదిత భూముల్లో ఏర్పాటు చేసిన పెగ్ మార్కులు

- మూడు గ్రామాల్లో 813 ఎకరాల భూ సేకరణ
- నేడు తిర్లాపురంలో గ్రామసభ

మణుగూరు టౌన్ : విద్యుత్ ప్రాజెక్టులకు, రాష్ట్ర అవసరాలకు విద్యుత్ డిమాండ్ పెరుగుతుండగా, అందుకు అవసరమైన బొగ్గు ఉత్పత్తికి సైతం ప్రాధాన్యత ఏర్పడింది. దీనికి తోడు సింగరేణి సంస్థ భవితవ్యాన్ని కూడా దృష్టిలో పెట్టుకుని మణుగూరు ఓసీ విస్తరణకు కసరత్తు చేస్తున్నారు. ఈ ఓసీలో బొగ్గు ఉత్పత్తి మరో రెండు సంవత్సరాల్లో ముగియనుండగా, విస్తరణ అనివార్యమైంది. ఈ మేరకు సింగరేణి, ప్రభుత్వ అధికారులు సంయుక్తంగా కసరత్తు ప్రారంభించారు. ఇందుకు అవసరమైన భూ సేకరణకు ఈనెల 4న రామానుజవరంలో గ్రామసభ నిర్వహించగా, బుధవారం తిర్లాపురంలో ఏర్పాటు చేస్తున్నారు.

భూ సేకరణ ఇలా...

2016–17లో ప్రారంభమైన మణుగూరు ఓపెన్‌కాస్ట్‌లో ఇప్పటివరకు 133.51 లక్షల టన్నుల బొగ్గును వెలికితీయగా, మరో రెండు సంవత్సరాల్లో బొగ్గు నిక్షేపాలు అడుగంటనున్నాయి. దీంతో ఓసీ విస్తరణకు తిర్లాపురం, రామానుజవరం, మణుగూరులో ఉన్న 109.5 హెక్టార్ల అటవీ భూమితో పాటు అదనంగా మరో 1000 ఎకరాలు అవసరం. ఇందులో సింగరేణి ఆధీనంలో ఉన్న 187 ఎకరాలకు తోడు 813 ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించనున్నారు. ఈ మేరకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ టి.సుమ రామానుజవరంలో గ్రామసభ ఏర్పాటు చేసి ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. ఇప్పటికే పెగ్ మార్కులు పెట్టిన సింగరేణి, రెవెన్యూ అధికారులు గ్రామసభలో వాటిని వివరించి సంబంధిత రైతులు పరిశీలించాలని సూచించారు. విస్తరణ అనంతరం మణుగూరు ఓసీ జీవిత కాలం మరో 16 సంవత్సరాలు పెరిగే అవకాశం ఉందని సింగరేణి అధికారులు అంచనా వేస్తున్నారు.

‘ధరణి’ @ 44 వేలు

- జిల్లాలో 85 శాతం దరఖాస్తుల పరిష్కారం
- పెండింగ్‌లో 3,200 అప్లికేషన్లు
- భూ సమస్యల పరిష్కారానికి కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్
- ఆర్డీఓలు, తహసీల్దార్లకూ అధికారాలు

చుంచుపల్లి : జిల్లాలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి ధరణి పోర్టల్ ద్వారా 44 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఇప్పటివరకు 85 శాతం మేర సమస్యలను అధికారులు పరిష్కరించగా, మరో 3,200 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని కూడా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. రెవెన్యూ అధికారులను బృందాలుగా ఏర్పాటు చేసి ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. ధరణి సమస్యలను పరిష్కరించే అధికారం ఇప్పటివరకు కలెక్టర్‌కు మాత్రమే ఉండగా.. ఈనెల ఒకటి నుంచి 9 వరకు చేపడుతున్న స్పెషల్ డ్రైవ్‌లో ఆర్డీఓలు, తహసీల్దార్లకు సైతం కొన్ని అధికారాలను బదలాయించింది. ప్రత్యేక డ్రైవ్‌లో మండల స్థాయిలో రెండు, మూడు బృందాలను ఏర్పాటు చేయగా తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్‌ఐలు బాధ్యులుగా వ్యవహరిస్తున్నారు. కమ్యూనిటీ సర్వేయర్లు, ఏఈఓలు, గ్రామ కార్యదర్శులు, ఇతర రెవెన్యూ సిబ్బంది వీరికి సహకరిస్తున్నారు. తహసీల్దార్ నుంచి సీసీఎల్‌ఏ వరకు ధరణి సమస్యలను ఏ స్థాయిలో ఎలా పరిష్కరించాలో ప్రభుత్వం ముందుగానే తెలియజేసింది. దీంతో జిల్లాలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు ముమ్మరంగా విచారణ చేపడుతున్నారు.



చుంచుపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ధరణి సమస్యలు పరిశీలిస్తున్న అధికారులు

భూమి వివరాలు, సర్వే నంబర్లు, పేర్లు, పాస్‌పుస్తకాల్లో తప్పులపై ఆరా తీస్తున్నారు.

ఇకనైనా ఇబ్బందులు తీరేనా..

జిల్లాలో ప్రధానంగా పాల్వంచ, జూలూరుపాడు, దుమ్ముగూడెం, దమ్మపేట, చర్ల, టేకులపల్లి మండలాల పరిధిలో మిస్సింగ్ సర్వే నంబర్లు, భూ విస్తీర్ణంలో తేడాలున్నట్లు అధికారులు గుర్తించారు. వీటిపై విచారణ చేపట్టాలని 2023 ఫిబ్రవరిలో ప్రభుత్వం ఆదేశించింది. దీంతో రంగలోకి దిగిన అధికారులు హడావిడి చేసినా క్షేత్రస్థాయిలో పరిశీలించకపోవడంతో అవి నేటికీ పరిష్కారానికి నోచుకోలేదు. దీంతో రైతులు రెండు, మూడుసార్లు దరఖాస్తు చేసినా, ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం ధరణి పెండింగ్ దరఖాస్తులపై దృష్టి సారించాలని ఆదేశించడంతో తమ ఇబ్బందులు త్వరలోనే తీరుతాయని రైతులు ఆశిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు టీఎం 4, 10, 14, 32 వంటి నాలుగు రకాల మాడ్యూళ్లలో ఉన్న సక్సేషన్స్ జీపీఏ, ఎస్‌పీఏ, భూ రికార్డుల అంశాల్లో ఫిర్యాదులు, ఖాతా మెర్జింగ్ సంబంధిత దరఖాస్తులు, రికార్డులను తహసీల్దార్ స్థాయిలో పరిశీలిస్తారు. టీఎం 7, 16, 20, 22, 26, 33 వంటి ఆరు రకాల మాడ్యూళ్లలో నాలా, భూసేకరణ ఫిర్యాదులు, ఎన్‌ఆర్‌ఐ పోర్టల్, సంస్థల పట్టా పాస్ పుస్తకం, కోర్టు కేసులు, మిస్సింగ్ సర్వేనంబర్, విస్తీర్ణ సవరింపు వంటి దరఖాస్తులను తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో విచారించి ఆర్డీఓకు పంపుతారు. వాటిపై ఆర్డీఓలు తుది నిర్ణయం తీసుకుంటారు. ఇక కేఎల్ ఫారం, టీఎం 3,4,15,23,24,31,33 వంటి ఏడు రకాల మాడ్యూళ్లలో ఉన్న మ్యుటేషన్, అసైన్ భూముల సక్సేషన్, ప్రొహిబిటెడ్ జాబితా ఆస్తుల సమస్యలు, పట్టా పాస్‌పుస్తకం, సెమీ అర్బన్ ల్యాండ్ పట్టా పాస్‌పుస్తకం, కోర్టు కేసులు, నాలా కన్వర్షేషన్, పట్టా పాస్‌పుస్తకంలో సవరింపులు వంటి దరఖాస్తులపై కలెక్టర్ తుది నిర్ణయం తీసుకుంటారు. 33వ మాడ్యూల్‌కు చెందిన అన్ని రకాల పాసుపుస్తకాల సవరణలను సీసీఎల్‌ఏ చేపడతారు.

జిల్లాలో పెండింగ్ దరఖాస్తులిలా..

గ్రీన్ రిలేటివ్ లాండ్	618
ప్రొవిడెడ్ ప్రాపర్టీ దరఖాస్తులు	190
పాస్‌బుక్ డేటా కరెక్షన్	1,400
వారసత్వ భూముల సక్సేషన్	260
ఎఫ్–ఎల్ ఫారాలు	400
మ్యూటేషన్ దరఖాస్తులు	42
కోర్టు కేసులు	50
ప్రాపర్టీ సమస్యలు	28
ఇతర దరఖాస్తులు	212

ఉద్యమకారులకు ఊరట

ఇల్లెందు: సింగరేణి 21 ఇంక్లైన్ గనిని కొనసాగించాలని కోరుతూ 2016లో 30 రోజుల పాటు ఆందోళన చేపట్టిన సింగరేణి బచావో ఉద్యమకారులు ఒకరోజు ఇల్లెందు ఏరియా బంద్ నిర్వహించారు. దీంతో ప్రజా జీవనానికి అంతరాయం కలుగుతుందని భావించిన పోలీసులు వారిని అరెస్టు చేసి 19 మందిపై కేసు నమోదు చేశారు. ఆ తర్వాత మూడేళ్ల పాటు మైన్‌ను కొనసాగించిన విషయం విదితమే. అయితే ఎనిమిదేళ్ల అనంతరం కేసు కొట్టివేస్తూ న్యాయమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. కేసు నుంచి ఊరట చెందిన వారిలో నాయకులు కె.సారయ్య, మహబూబ్, హరిసింగ్ నాయక్, పెండెకట్ల యాకయ్య, హరీష్‌గౌడ్, చంటి, ప్రమోద్, ప్రశాంత్, ధనరాజ్, ఉప్పు శ్రీను, అయ్యప్ప, ఖదీర్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

పీఓను కలిసిన నూతన ఆర్డీఓ


పీఓకు మొక్క అందజేస్తున్న ఆర్డీఓ దామోదర్‌రావు

భద్రాచలం: భద్రాచలం రెవెన్యూ డివిజనల్ అధికారిగా కొల్లు దామోదర్‌రావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించారు. ఈసందర్భంగా పీఓ మాట్లాడుతూ.. గిరిజన గ్రామాల్లో రెవె న్యూ, భూ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఏజెన్సీలో పనిచేసే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉందని, సమస్యల పరిష్కరానికి కృషి చేస్తానని దామోదరరావు తెలిపారు.

భద్రాద్రి వాసికి డాక్టరేట్


శివకృష్ణ

భద్రాచలంటౌన్: భద్రాచలానికి చెందిన రిటైర్డ్ ఎస్‌ఐ గుజ్జు పుల్లదాసు కుమారుడు శివకృష్ణకు డాక్టరేట్ లభించింది. డాక్టర్ ఎస్.ప్రకాష్ పర్యవేక్షణలో ఆయన సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి గాను చెన్నైలోని బీఎస్ అబ్దుల్ రెహమాన్ క్రెసెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నుంచి డాక్టరేట్ ప్రకటించారు. యూనివర్సిటీలో మంగళవారం జరిగిన స్నాతకోత్సవంలో ఆయన డాక్టరేట్ స్వీకరించారు.

మైనింగ్ కళాశాలలో ఎమ్మెల్యే తనిఖీ

సింగరేణి(కొత్తగూడెం): లక్ష్మీదేవిపల్లి గ్రామంలోని కేయూ అనుబంధ మైనింగ్ కళాశాలను మంగళవారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపకులతో కలిసి కళాశాల సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో పాల్వంచ తహసీల్దార్ వినయ్, ఎస్‌కే సాబీర్‌పాషా పాల్గొన్నారు.

మహబూబాబాద్ ఎంపీ టికెట్ ఆదివాసీలకే కేటాయించాలి


మాట్లాడుతున్న చందా లింగయ్యదొర

ఇల్లెందు: మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో అత్యధికంగా ఉన్న ఆదివాసీలకే కాంగ్రెస్ నుంచి ఎంపీ టికెట్ కేటాయించాలని జాతీయ ఆదివాసీ అఖిలపక్షం, ప్రజా సంఘాల జేఏసీ జాతీయ కన్వీనర్ చందా లింగయ్యదొర కోరారు. ఇల్లెందులో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే బీఆర్‌ఎస్ సామాజిక న్యాయం పాటించకుండా ఏకపక్షంగా సీట్లు ప్రకటించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ అయినా సానుకూలంగా స్పందించకపోతే త్వరలోనే గాంధీభవన్ ముట్టడిస్తామని చెప్పారు. ఈ విషయంలో బీఆర్‌ఎస్, బీజేపీ, ఇతర పార్టీలు కూడా పునరాలోచన చేయాలని కోరారు. ఆదివాసీ సామాజిక వర్గాన్ని విస్మరిస్తే పార్టీల నేతలను గ్రామాల్లోకి రాకుండా అడ్డుకుంటామని తెలిపారు. సమావేశంలో నాయకులు పొడుగు శ్రీనాథ్, వట్టం నారాయణ, రమణాల లక్ష్మయ్య, ముక్తి రాజు, ధనసరి రామ్మూర్తి, వట్టం కన్నయ్య, కొమరం బుచ్చయ్య, ఈసాల రామచంద్రు, దుగ్గారపు జనార్దన్, తాటి వెంకటేశ్వర్లు, జబ్బా రామ్మూర్తి, తాటి పాపారావు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

మావోలకు వ్యతిరేకంగా వాల్‌పోస్టర్లు

ఇల్లెందు: ఇల్లెందు మండలం కొమరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి మావోయిస్టులకు వ్యతిరేకంగా వాల్‌పోస్టర్లు వెలిసాయి. 'ప్రజాస్వామ్య ఆదివాసీ సంఘం' పేరిట ఈ పోస్టర్లు ఏర్పాటు కాగా, మహిళా దినోత్సవం సందర్భంగా మావోయిస్టు దళాల చెర నుంచి మహిళల విముక్తికి పోరాడాలని పిలుపునిచ్చారు.

పేకాట స్థావరంపై దాడి

ఇల్లెందు: ఇల్లెందులోని జగదాంబ ఏరియాలో పేకాట స్థావరంపై మంగళవారం రాత్రి సీఐ కరుణాకర్, ఎస్సై సందీప్ ఆధ్వర్యాన దాడి చేశారు. ఈసందర్భంగా పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులో తీసుకున్నారు.

తల్లీ బిడ్డ అదృశ్యంపై కేసు


బిడ్డతో ఆదిలక్ష్మి (ఫైల్)

భద్రాచలంఅర్బన్: ఏపీ రాష్ట్రంలోని చింతూరు మండలం కాటుపల్లి గ్రామానికి చెందిన తల్లీ, బిడ్డ కనిపించకుండా పోయిన ఘటనపై మంగళవారం భద్రాచలం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌ఐ విజయలక్ష్మి కథనం ప్రకారం.. కాటుపల్లి గ్రామానికి చెందిన వివాహిత సోడె ఆదిలక్ష్మి.. తన బిడ్డను తీసుకుని గత నెల 20వ తేదీన భద్రాచలానికి ఓ పని నిమిత్తం వచ్చింది. అప్పటి నుంచి వారిద్దరి ఆచూకీ తెలియకుండా పోయింది. స్నేహితులు, బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ దొరకలేదు. దీంతో మహిళ భర్త సోడె రాంబాబు ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ విజయలక్ష్మి చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు 87126 82160 నంబర్‌లో సమాచారం అందించాలని ఆమె కోరారు.

చేరువవుతారా.. చేజారుస్తారా?!

- 25 రోజుల్లో 7.28 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం
- ఫిబ్రవరిలో ఆరు ఏరియాల్లోనే 100శాతం ఉత్పత్తి
- గడిచిన 11నెలల్లో ఐదు ఏరియాలే ముందంజ


ఓసీలో బొగ్గు ఉత్పత్తి చేస్తున్న శావెల్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఈ ఏడాది 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని లక్ష్యంగా నిర్దేశించుకోగా.. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు 25 రోజుల గడువు మాత్రమే ఉంది. ఈలోగా మిగిలిన 7.28 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించాల్సి ఉంది. గడిచిన 11 నెలల్లో సింగరేణి వ్యాప్తంగా ఉన్న 23 భూగర్భగనులు, 19 ఓసీల్లో 63.14 మిలియన్ టన్నుల లక్ష్యానికి 62.72 మిలియన్ టన్నుల (99శాతం) ఉత్పత్తి సాధించినట్లు సింగరేణి తన గణాంకాల్లో తెలిపింది. విభాగాల వారీగా పరిశీలిస్తే భూగర్భ గనుల్లో 75,34,100 టన్నులకు గాను 54,32,733(72శాతం), ఓసీల్లో 5,56,07,000 టన్నులకు గాను 5,72,89,833 టన్నులు(103 శాతం) ఉత్పత్తి నమోదైంది. మొత్తం లక్ష్యంలో మిగిలిన ఉత్పత్తి సాధన కోసం రోజుకు 2.30 లక్షల టన్నుల మేర బొగ్గు వెలికి తీయాల్సి ఉండడంతో యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించింది. అయితే, ఆర్థిక సంవత్సరం మొదటి నుంచే ప్రణాళికాయుతంగా ముందుకు సాగాల్సిన అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించి.. ఇప్పుడు తమను పరుగులు పెట్టిస్తుండడంతో కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమన్వయ లేమితో..

సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో సుమారు 2,400 మంది అధికారులు పనిచేస్తుండగా.. వీరిలో భూగర్భగనులు, ఓసీల్లో కలిపి సుమారు 1,600 మంది ఉంటారు. అయితే, ఇందులో చాలా మంది విధుల్లో శ్రద్ధ వహించకపోవడం.. అన్ని విభాగాలను సమన్వయం చేయడం లేదని ఉన్నతాధికారులు గుర్తించారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తే లక్ష్యసాధన సులవవుతుందని చెప్పినా అధికారుల తీరు మారడం లేదని సమాచారం. భూగర్భగనుల్లో పనిచేసే అధికారులు ఏనాడు కూడా గనుల్లోకి దిగకుండా కిందిస్థాయి అధికారులు, ఉద్యోగుల ద్వారా సమాచారం తీసుకుని నివేదిక సమర్పిస్తున్నారని సీఎండీ గుర్తించినట్లు తెలిసింది. ఇక కొందరు కార్మికులు గనుల్లో పని చేయొద్దనే భావనతో... సర్ఫేస్ పనుల కోసం పైరవీల బాట పట్టడంపై అధికారులు ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం.

గడిచిన 11నెలల్లో ఏరియాల వారీగా ఉత్పత్తి (టన్నుల్లో)

ఏరియా	నిర్దేశిత లక్ష్యం	ఉత్పత్తి	శాతం
ఇల్లెందు	34,50,000	38,72,246	112
మణుగూరు	1,08,21,500	1,19,14,085	110
బెల్లంపల్లి	32,00,000	35,17,943	110
కొత్తగూడెం	1,17,98,500	1,24,43,792	105
ఆర్‌జీ - 3	49,50,000	51,74,613	105
ఆర్‌జీ - 2	86,20,000	85,57,700	99
ఆర్‌జీ - 1	39,78,700	38,93,471	98
మందమర్రి	42,03,500	37,08,457	88
శ్రీరాంపూర్	60,72,000	52,26,471	86
ఆండ్రియాల	15,90,900	13,18,263	83
మొత్తం	6,31,41,100	6,27,22,556	99

ఆరు ఏరియాల్లోనే శత శాతం

సింగరేణిలోని 11 ఏరియాల్లో కేవలం ఆరింట మాత్రమే ఫిబ్రవరిలో ఉత్పత్తి వందశాతం దాటింది. ఆర్జీ–3 ఏరియా 141శాతంతో అగ్రస్థానంలో నిలవగా, ఆర్జీ–1 ఏరియా 129 శాతం, ఆర్జీ–2 ఏరియా 109 శాతం, ఆండ్రియాల 108 శాతం, శ్రీరాంపూర్ ఏరియా 107 శాతం, కొత్తగూడెం ఏరియా 106 శాతం ఉత్పత్తి సాధించాయి. మిగతా వాటిలో భూపాలపల్లి ఏరియా 92 శాతం, మందమర్రి 90, ఇల్లెందు ఏరియా 87, మణుగూరు ఏరియా 80 శాతం ఉత్పత్తి నమోదు చేయగా... బెల్లంపల్లి ఏరియాలో కేవలం 68 శాతం ఉత్పత్తి సాధించడం గమనార్హం. కాగా, ఫిబ్రవరిలో మొదటి మూడు స్థానాలు రామగుండం రీజియన్‌లోనే ఉన్నాయి.

లక్ష్యాలను చేరుకోవాల్సిందే...



కంపెనీ నిర్దేశించిన వార్షిక లక్ష్యాలను అన్ని ఏరియాల్లో సాధించాల్సిందే. ఇప్పటికే ఈ విషయమై సమీక్షించి రోజువారీ పర్యవేక్షిస్తున్నాం. ఈ ఆర్థిక సంవత్సరం మిగిలిన సమయంలో లక్ష్యం మేరకు బొగ్గు ఉత్పత్తి చేయాల్సిందిగా సూచనలు చేశాం. – ఎన్.బలరామ్, సీఎండీ

నాణ్యమైన వస్తువులనే సరఫరా చేయాలి

ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్


టెండర్ల ప్రక్రియను పరిశీలిస్తున్న పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం: ఐటీడీఏ పరిధిలోని పాఠశాలలు, వసతి గృహాలు, బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు నిబంధనల మేరకు నాణ్యమైన వస్తువులనే సరఫరా చేయాలని పీఓ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. భద్రాచంలోని ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన టెండర్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. హనుమకొండ, హైదరాబాద్, భద్రాచలం నుంచి హాజరైన టెండర్‌దారులు సమర్పించిన వస్తువులను పరిశీలించి మాట్లాడారు. టెండర్ దక్కించుకున్న వారు నాణ్యమైనవి సరఫరా చేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, అధికారులు విజయ్‌కుమార్, జహీరుద్దీన్, నర్సింగరావు, చంద్రమోహన్, రూపాదేవి పాల్గొన్నారు.

- ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని గిరిజన గురుకులాల్లో 6, 7, 8, 9వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీతో పాటు 8వ తరగతిలో కొత్త వారికి ప్రవేశాలు కల్పించనున్నట్లు ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 23వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే, ఏప్రిల్ 21న పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు.
- ఉమ్మడి జిల్లాలో ఆర్‌ఆర్‌బీ, స్టాఫ్ సెలెక్షన్ కమిషన్, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ గిరిజన యువతకు ఐటీడీఏ ఆధ్వర్యాన ఈ నెల 7వ తేదీన అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పీఓ ప్రతీక్‌జైన్ తెలిపారు. ఉదయం 9 గంటలకు ఐటీడీఏ కార్యాలయంలో మొదలయ్యే సదస్సును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్రీడా పాఠశాలల్లో విద్యార్థుల ఎంపికకు పోటీలు


ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న ఏటీడీఓ చంద్రమోహన్

పాల్వంచరూరల్/కారేపల్లి: పాల్వంచ మండలం కిన్నెరసాని, కాచనపల్లి, కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లిలో క్రీడా పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశాలు కల్పించేందుకు మంగళవారం పోటీలు నిర్వహించారు. కిన్నెరసాని, ఉసిరికాయలపల్లి పాఠశాలల్లో జరిగిన ఈ పోటీలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి విద్యార్థులు హాజరయ్యారు. పోటీలను దమ్మపేట ఏటీడీఓ చంద్రమోహన్, అసిస్టెంట్ స్పోర్ట్స్ ఆఫీసర్ బి.నెహ్రూ, క్రీడల కన్వీనర్ నామా నాయక్ ప్రారంభించి మాట్లాడారు. కిన్నెరసానిలో పోటీలు మరో రెండు రోజులు కొనసాగనుండగా, ఉసిరికాయలపల్లిలో నిర్వహిస్తున్న పోటీలు ముగిశాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి బొల్లి గోపాల్‌రావు, ఏఎస్‌ఓ కొమరం వెంకటరమణతో పాటు నాగేశ్వరరావు, రాంబాబు, చందు, బుగ్గ వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, హరికృష్ణ, వెంకటేశ్వర్లు, డి.రవి పాల్గొన్నారు.

పురుగుమందు డబ్బాలతో రైతుల ఆందోళన


ఆందోళన చేస్తున్న రైతులు

ములకలపల్లి: తమ వరి చేలల్లో నిర్ణీత కాలవ్యవధి కంటే ముందే కంకులు రావడంతో తీవ్రంగా నష్టపోతున్నామని బాధిత రైతులు ఆందోళన చేపట్టారు. పురుగుమందు డబ్బాలు చేతపట్టుకుని విత్తనాలు విక్రయించిన దుకాణం ఎదుట మంగళవారం నిరసన చేపట్టారు. తాళ్లపాయ గ్రామానికి చెందిన పలువురు రైతులకు చెందిన వరి మొక్కలకు ముందుగా కంకులు రావడంతో బలహీనంగా మారాయని, తాలు కంకులు ఏర్పడ్డాయని వాపోయారు. కల్తీ విత్తనాల వల్లే తమకు తీరని నష్టం వాటిల్లిందని ఆరోపించారు. సమాచారం తెలుసుకున్న ఎంఏఓ కరుణామయి, సాయి వచ్చి రైతులతో మాట్లాడారు. ఈ ఘటనపై ఇప్పటికే విచారణ ప్రారంభించామన్నారు. తదుపరి ఆదేశాలిచ్చేవరకూ విత్తన దుకాణంలో క్రయవిక్రయాలు నిషేధిస్తూ తక్షణమే నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

కోడి పందేల స్థావరంపై దాడి

అశ్వారావుపేటరూరల్: మండలంలోని దబ్బతోగు గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై మంగళవారం పోలీసులు దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వ్యక్తుల వద్ద నుంచి ఒక కోడి పుంజు, ద్విచక్రవాహనంతోపాటు రూ.9వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్‌ఐ శ్రీరాముల శ్రీను తెలిపారు. కోడి పందేల స్థావరం నుంచి మరికొందరు పరారు కాగా, వారి వివరాలు సేకరిస్తున్నట్లు చెప్పారు.

నేటి నుంచి పగిడిద్దరాజు జాతర

గుండాల: మేడారం సమ్మక్క భర్త, అరెం వంశీయుడైన పగిడిద్దరాజు జాతర మండలంలోని యాపలగడ్డలో బుధవారం ప్రారంభం కానుంది. గత నెల 21, 22, 23 తేదీల్లో మేడారంలో జరిగిన జాతరకు యాపలగడ్డ నుంచి పగిడిద్దరాజును (కాలినడకన) తీసుకెళ్లారు. అక్కడ సమ్మక్క – పగిడిద్దరాజుల వివాహం అనంతరం 16 రోజుల తర్వాత యాపలగడ్డలో సమ్మక్క – పగిడిద్దరాజుల నాగవెల్లి జాతర నిర్వహించడం ఆనవాయితీ. నేటి నుంచి మూడు రోజుల పాటు జరిగే జాతరకు గ్రామ సమీపంలో గద్దెల వద్ద ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం ఘనంగా జాతర నిర్వహిస్తారు. తొలిరోజు బుధవారం పగిడిద్దరాజును వనం(గుట్ట) నుంచి గుడికి తీసుకొచ్చి, రాత్రి ఎదురిల్లుట వేడుక చేస్తారు. గురువారం వన దేవతను గుట్ట నుంచి తీసుకొస్తారు. సాయంత్రం జోగు వెల్లుట, రాత్రి దేవతలను గంగాస్నానానికి తీసుకెళ్తారు. తెల్లవారుజామున గుడిమెలిగే కార్యక్రమం తర్వాత పగిడిద్దరాజు–సమ్మక్కలకు హారం ఇస్తారు. శుక్రవారం భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. శనివారం ఉదయం దేవతలను గుట్టకు సాగనంపడంతో జాతర ముగుస్తుంది. మూడు రోజుల పాటు జరిగే జాతరకు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, ములుగు జిల్లాల నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అరెం వంశీయులు లచ్చు పటేల్, బుచ్చయ్య, అప్పయ్య, ఇద్దయ్య, బిక్షం, కాంతారావు తెలిపారు.

శ్రామిక మహిళా పోరాట దినంగా జరుపుకుందాం..

చర్ల: మార్చి 8న అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినంగా జరుపుకుందామని, మహిళలపై జరుగుతున్న అమానవీయ దాడులకు, రాజ్యహింసకు వ్యతిరేకంగా పోరాడుదామని మావోయిస్టు చర్ల శబరి ఏరియా కమిటీ కార్యదర్శి అరుణ పిలుపునిచ్చారు. మంగళవారం ఆమె పత్రికలకు లేఖ విడుదల చేశారు. మహిళలు పితృస్వామ్యం నుంచి విముక్తి కోసం సంఘటితంగా పోరాడాలని అంతర్జాతీయ మహిళా దినోత్సవం నొక్కి చెబుతోందని పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక కులం, మతం, జాతి పేరుతో మహిళలను, పురుషులను విడదీసి దాడులు సాగిస్తున్నారని ఆరోపించారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళలను ఆదర్శంగా తీసుకొని దేశంలో మహిళల విముక్తి కోసం పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు.

పంటల నమోదు ప్రక్రియ పక్కాగా నిర్వహించాలి

టేకులపల్లి: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో తలపెట్టిన పంట నమోదు ప్రక్రియ పక్కాగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయ అధికారి వేల్పుల బాబూరావు సూచించారు. మంగళవారం మండలంలోని కిష్టారం గ్రామంలో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం వరి పంటలను పరిశీలించారు. వరిలో కాండం తొలుచు పురుగు నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 ఎంఎల్ లేదా కార్తాప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు 8 కేజీలు ఎకరానికి వేయాలని తెలిపారు. వరి చిరుపొట్ట దశలో యూరియా 25 కేజీలు, పొటాష్ 20 కేజీలు వేయడం వల్ల గింజ గట్టిపడి నాణ్యత బాగుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ అన్నపూర్ణ, ఏఈఓ రెహానా పాల్గొన్నారు.


పంటను పరిశీలిస్తున్న డీఏఓ బాబూరావు

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ


విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్‌ఎం రమ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న అక్షయ భవాని రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ చాటింది. హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఈ పోటీల్లో అక్షయ కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. కాగా, విద్యార్థినిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమ, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.

ఇరువర్గాల ఘర్షణలో ముగ్గురికి గాయాలు


గాయపడిన రాధ

చంద్రుగొండ: భూ వివాదంపై జరిగిన ఘర్షణలో ముగ్గురికి గాయపడిన ఘటన అయన్నపాలెం గ్రామంలో మంగళవారం జరిగింది. అయన్నపాలెం గ్రామంలో ఇల్లు, ఇంటి స్థలం విషయమై ఆళ్లకుంట రాధ, బాలకృష్ణ కుటుంబాల మధ్య కొన్నేళ్లుగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో రాధతోపాటు కుటుంబ సభ్యులు వివాదం ఉన్న స్థలంలోకి వెళ్లారు. బాలకృష్ణ కుటుంబీకులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో జరిగిన ఘర్షణలో రాధతోపాటు మాధవి, సాయి గాయపడ్డారు. రాధ తలకు బలమైన గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా మారింది. 108లో క్షతగాత్రులను కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మాచినేని రవి తెలిపారు.

టిప్పర్ ఢీకొని ఒకరు మృతి


నర్సింహారావు(ఫైల్)

పాల్వంచరూరల్/జూలూరుపాడు: కంకరలోడుతో వేగంగా వచ్చిన టిప్పర్ బైక్‌ను ఢీకొట్టడంతో ద్విచక్రవాహదారుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన జగన్నాథపురం శివారులో మంగళవారం చోటుచేసుకుంది. జూలూరుపాడు మండలం పాపకొల్లు శివారు బచ్చలగూడెం గ్రామానికి చెందిన మేకల వ్యాపారి జక్కుల నర్సింహారావు, గుడిపాటి రాము కలిసి అశ్వాపురం వెళ్లి మేకలను కొనుగోలు చేసి ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తున్నారు. మండలంలోని జగన్నాథపురం శివారు తొగ్గూడెం క్రాస్‌రోడ్డు వద్దకు రాగానే వేగంగా వచ్చిన టిప్పర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో నర్సింహారావు (41) అక్కడికక్కడే మృతి చెందగా రాముకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ శ్రీనివాస్ సందర్శించారు. మృతుడి భార్య జక్కుల ఉమ ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్ వాసం శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

డిపెండెంట్ వయోపరిమితిపై త్వరలోనే సర్క్యులర్


మాట్లాడుతున్న త్యాగరాజన్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో డిపెండెంట్ కార్మికుల వయోపరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచుతూ త్వరలో సర్క్యులర్ జారీ అయ్యే అవకాశముందని ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ సి.త్యాగరాజన్ తెలిపారు. అలాగే, ఆదాయపన్ను విషయంలోనూ సీఎండీ సానుకూలంగా ఉన్నారని పేర్కొన్నారు. కొత్తగూడెంలోని ఐఎన్‌టీయూసీ భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఆరు ఏరియాలను తమ యూనియన్ గెలిచినా, ఓటింగ్ శాతం ఆధారంగా ఏఐటీయూసీకి గుర్తింపు ఇచ్చారన్నారు. ఈ మేరకు కార్మికులు యూనియన్‌పై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా సమస్యల పరిష్కారానికి పాటుపడాలని సూచించారు. కాగా, మందమర్రిలో మాదిరి యువత కోసం కొత్తగూడెంలోనూ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు ఆల్బర్ట్, కాలువ నాగభూషణం, అభిషేక్, జలీల్, సోమరాజ్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రీజియన్ పరిధిలోని కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడిగా ఎండీ రజాక్, కార్పొరేట్ ఏరియాకు పీతాంబరం, ఇల్లెందుకు జె.వెంకటేశ్వర్లు, మణుగూరు ఏరియా ఉపాధ్యక్షుడిగా కృష్ణంరాజు పేర్లను త్యాగరాజన్ ప్రకటించారు.

టీఎస్‌ఎస్పీ కానిస్టేబుల్ మృతికి నివాళి


నివాళులర్పిస్తున్న పోలీస్ అధికారులు


రమేశ్ (ఫైల్)

కరకగూడెం: అనారోగ్యంతో మండలానికి చెందిన టీఎస్‌ఎస్పీ కానిస్టేబుల్ మృతి చెందగా పలువురు నివాళులర్పించారు. మండలంలోని చిరుమళ్ల జీపీ పోలకమ్మతోగు గ్రామానికి చెందిన కొమరం రమేశ్ (41) ఆరో బెటాలియన్ టీఎస్‌ఎస్పీ 2004 బ్యాచ్ కానిస్టేబుల్‌గా కొత్తగూడెం చాతకొండ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తిస్తున్నారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం రాత్రి ఇంటివద్ద మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టీఎస్‌ఎస్పీ ఆరో బెటాలియన్ కమాండెంట్ డి.శివప్రసాద్ రెడ్డి, అడిషనల్ కమాండెంట్ అంజయ్య, బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ స్వామి, సిబ్బంది మృతుడి స్వగ్రామం చేరుకుని, పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆర్థిక సాయం అందించి, కుటుంబానికి అండగా నిలుస్తామని చెప్పారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు. రమేశ్ మృతితో వారు ఒంటరి వారయ్యారు.

డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య


రమ్య (ఫైల్)

టేకులపల్లి: అనారోగ్యంతో మనస్తాపం చెందిన డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సైదారవూఫ్ కథనం ప్రకారం.. మండలంలోని తొమ్మిదోమైలు తండా పంచాయతీ కోటల్ల గ్రామానికి చెందిన మోకాళ్ల వెంకటేశ్వర్లు, కవిత దంపతుల కుమార్తె రమ్య (19) హన్మకొండలో ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. నెల కిందట మేడారం జాతర నేపథ్యంలో స్వగ్రామానికి తీసుకొచ్చారు. ఆమె కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈక్రమంలో తీవ్రంగా కలత చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరిపెట్టుకుని ఆత్మహత్య చేసుకుంది. టేకులపల్లి ఎస్‌ఐ ఘటనా స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఇల్లెందు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ వివరించారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కారు


డివైడర్‌ను ఢీకొన్న కారు

పాల్వంచరూరల్: టైర్ పంక్చరై కారు డివైడర్‌ను ఢీకొట్టిన ఘటన కేశవాపురం వద్ద మంగళవారం చోటుచేసుకుంది. పాల్వంచకు చెందిన వ్యక్తి కారులో పెద్దమ్మగుడి నుంచి పాల్వంచ వైపు వస్తున్నాడు. కేశవాపురం వద్దకు రాగానే టైరు పంక్చర్ కావడంతో డివైడర్‌ను ఢీకొట్టాడు. అతడికి స్వల్ప గాయాలు కావడంతో కారును వదిలేసి పరారయ్యాడు. పోలీసులు కారును స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు.